క్లుప్తంగా

పెదకూరపాడులో పర్యటించిన ఎమ్మెల్యే ప్రవీణ్



పెదకూరపాడు : ఒక నిర్మాణాత్మక ప్రణాళికతో గ్రామ సుస్థిర అభివృద్ధికి కృషి చేస్తానని, అందరి సహకారంతో ప్రగతికి బాటలు వేసుకుందామని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మంగళవారం ఆయన పెదకూరపాడులో పర్యటించారు. ప్రజల నుంచి సమస్యలను తెలుసుకున్నారు. నిరుపయోగంగా ఉన్న బీసీ హాస్టల్‌ను పరిశీలించారు. ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి, సామాజిక అవసరాలకు వినియోగించుకోవడానికి ఉన్న అవకాశాలను పర్యవేక్షించారు. గతంలో రూ.42 లక్షలతో నిర్మించిన పంచాయతీరాజ్ గెస్ట్ హౌస్‌ను పరిశీలించి వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విలేజ్ పార్క్, తాగునీటి చెరువుపై చుట్టూ నిర్మించిన వాకింగ్ ట్రాక్‌ను పరిశీలించారు. దాతల సహకారంతో ఇచ్చిన స్థలంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణానికి ఉన్న అవకాశాలను పరిశీలించారు. టీడీపీ జిల్లా కార్యదర్శి ఆర్తిమళ్ల రమేష్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రాంగోపాలరావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉపాధి హామీ గ్రామ సభలు

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల, తొండపి, లంకెలకూరపాడు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్‌లో భాగంగా మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. ఆయా సభల్లో ఉపాధి హామీ సోషల్ ఆడిట్ తనిఖీ బృందం సభ్యులు గుర్తించిన అంశాలను గ్రామ సభలో వినిపించారు. మస్టర్ షీట్‌లో నిర్వహణ లోపం ఉన్నట్లుగా గుర్తించారు. లంకెలకూరపాడులో జరిగిన గ్రామ సభకు పంచాయతీ కార్యదర్శి హాజరు కాకుండా ఉండటాన్ని గుర్తించారు. అతని వద్ద రికార్డులు అప్పగించలేదని సభలో సభ్యులు వివరించారు. పని ప్రాంతాన్ని తనిఖీ చేసేందుకు వచ్చిన విజిటర్ల రికార్డుల నిర్వహణలోనూ లోపాలున్నట్లుగా గుర్తించారు. ఆయా గ్రామ సభల్లో గుర్తించిన అంశాలను నమోదు చేసుకున్నారు. గ్రామ సభలో ఎస్సార్పీ ఎం.లోకేష్, డీఆర్పీలు శివ, శరత్‌కుమార్, తిరుపాల్, కిషోర్, ఆయా గ్రామాల ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు

రాజుపాలెం: మండల కేంద్రంలోని రాజుపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నేడు తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని దేవస్థానం చైర్మన్ పొత్తూరి వెంకట రమసుబ్బారావు మంగళవారం తెలిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తామని చెప్పారు.

దళిత బాలికపై లైంగిక దాడి చేసిన నిందితుణ్ని అరెస్ట్ చేయాలి

సత్తెనపల్లి: దళిత బాలికపై అత్యాచారం, హత్య చేసిన నిందితుడ్ని వెంటనే అరెస్టు చేయాలని పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు యాసారపు బాబు మంగళవారం డిమాండ్ చేశారు. చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఏడవ తరగతి చదువుతున్న బాలికను అత్యంత కిరాతకంగా అత్యాచారం చేసి హత్య చేసిన గ్యాస్ డెలివరీ బాయ్‌ను వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద అరెస్ట్ చేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన న్యాయం చేయాలని, ఆ కుటుంబానికి న్యాయం జరగని పక్షాన రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాల ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ఆధ్వర్యంలో బాలిక కుటుంబానికి న్యాయం జరిగే వరకూ పోరాడతామన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన కౌలు రైతు మృతి

క్రోసూరు: ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతున్న యువ కౌలు రైతు సోడిసెట్టి గోపాలకృష్ణ(26) మృతి చెందినట్లు ఎస్ఐ ఎం.షఫీ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఎర్రబాలెం గ్రామానికి చెందిన గోపాలకృష్ణ వ్యవసాయంలో అప్పులు ఎక్కువ కావటంతో మనస్థాపానికి గురై ఈ నెల 10వ తేదీ ఇంటి వద్ద గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. పరిస్థితి గుర్తించిన కుటుంబీకులు గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం కలరు. ఆసుపత్రి నుంచి వచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సంతకాల ఫోర్జరీపై కొనసాగుతున్న దర్యాప్తు

దాచేపల్లి: తహసీల్దార్, వీఆర్వోల సంతకాలు ఫోర్జరీ కేసులో విచారణ కొనసాగుతోందని తహసీల్దార్ గీతావాణి తెలిపారు. తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓ రైతు బ్యాంకు రుణాలకు సంబంధించి రెవెన్యూ శాఖ తరఫున ఇచ్చే పత్రంపై తన సంతకంతోపాటు భట్రుపాలెం వీఆర్వో సంతకం ఫోర్జరీ చేసినట్లుగా గుర్తించి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని పోలీసులకు ఫిర్యాదు చేశామని, తనపై దుష్ప్రచారం తగదని అన్నారు.

చెట్ల నరికివేత.. ఆగ్రహంలో పర్యావరణ ప్రేమికులు

- బ్రిటీష్ కాలం నాటి చెట్లను నరకాల్సిన అవసరం ఏమిటి?
- గతంలో అన్నా క్యాంటీన్‌కు అడ్డం లేనిది ఇప్పుడు ఎలా వచ్చింది
- మండే ఎండలు, వానల నుంచి సేదతీరుతున్న ప్రయాణికులు
- బాధ్యులపై చర్యలు చేపట్టాలని అన్ని వర్గాల ప్రజల మండిపాటు



పట్టణంలోని తాలూకా సెంటర్‌లో నరకకముందు వేప చెట్టు మొదలు



వేప చెట్టు నరికి చేసిన ముక్కలు

సత్తెనపల్లి: పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజా ప్రతినిధులు, అధికారులు మొక్కలు నాటాలని, చెట్లను సంరక్షించాలని పదే పదే సభల్లో చెబుతున్నారు. మొక్కలు నాటడం సంగతి దేవుడెరుగు.. పర్యావరణానికి నష్టం కలిగించే విధంగా బహిరంగ ప్రదేశాల్లో ఉన్న వందల ఏళ్ల నాటి చెట్లను అర్ధంతరంగా నేలకొరిగిస్తున్నారు. ఈ తీరు పట్ల పర్యావరణ ప్రేమికులు భగ్గుమంటున్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని తాలూకా సెంటర్‌లో బ్రిటీష్ కాలం నాటి వేప చెట్లను అర్ధంతరంగా నరకడాన్ని స్థానిక ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. 2019కి ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వం తాలూకా సెంటర్‌లో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసింది. అప్పట్లో అన్నా క్యాంటీన్‌కు ఎలాంటి అడ్డం లేని వేప చెట్లు ప్రస్తుతం ఎందుకు అడ్డంకిగా మారాయో తెలియడం లేదు. వందల ఏళ్ల నాటి వేప చెట్లను ఒక పక్క నరుకుతూ మరో పక్క మొక్కలు నాటాలంటూ ప్రజా ప్రతినిధులు, అధికారులు ఊదరగొట్టడాన్ని పర్యావరణ ప్రేమికులు తప్పుపడుతున్నారు. గ్లోబల్ వార్మింగ్ నేపథ్యంలో ప్రధానమంత్రి నుంచి సర్పంచ్ వరకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి, వాటిని సంరక్షించాలని కోరుతున్న నేపథ్యంలో మండే ఎండలు, వర్షాల నుంచి ప్రయాణికులు సేద తీరుస్తున్న చెట్లను నరకడం ఏమిటి అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోగా నరికివేతదారులకు సహకరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వందేళ్లు పైబడిన వేప చెట్లను నరికిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. చెట్లను నరికి ముక్కలు ముక్కలుగా చేసి తరలించిన కలపను సైతం రికవరీ చేయాలని కోరుతున్నారు.

చెట్లను నరకడమంటే మనిషి ప్రాణం తీయడమే



ఒక చెట్టును నరకడమంటే ఒక మనిషి ప్రాణం తీయడమే. మనిషి ప్రాణం తీయడం కంటే చెట్టును నరకడం ఎక్కువ ప్రమాదం. సృష్టికి మూలం చెట్లు. నిబంధనలను అతిక్రమించి సత్తెనపల్లి తాలూకా సెంటర్‌లోని వేప చెట్టును నరికివేశారు. అన్నా క్యాంటీన్ కనబడటం లేదని, అడ్డంగా ఉందని నరికినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఘటనపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. సత్తెనపల్లిలో వాల్టా చట్టం పటిష్టంగా అమలు చేయాలి.

-జె.విజయ్ కుమార్, న్యాయవాది, సత్తెనపల్లి

చెట్లు నరకడం దారుణం



వందల సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన చెట్లను నరకడం దారుణం. మొక్కలు నాటాలని ప్రజా ప్రతినిధులు ఓవైపు చెబుతుంటే.. మరోవైపు పెరిగిన చెట్లను నరకడం సరైనది కాదు. తాలూకా సెంటర్‌లో ఈ చెట్లు ఎంతో మంది ప్రయాణికులకు నీడనిస్తూ ఉపయోగపడుతున్నాయి. అన్నా క్యాంటీన్‌కు అడ్డం అనే పేరుతో చెట్లను నరికి వేసిన వారిపై అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి.

-పెండ్యాల మహేష్, సీపీఎం మండల కార్యదర్శి, సత్తెనపల్లి

నూతన చట్టాలను నిలుపుదల చేయాలి



న్యాయదేవత విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సత్తెనపల్లి: కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నూతన చట్టాలను నిలుపుదల చేయాలని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పాటిబండ్ల రవి ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి న్యాయదేవత విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడారు. అనంతరం నూతన చట్టాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు మర్రి వెంకట సుబ్బారెడ్డి, డి.శ్రీనివాసరావు, జె.విజయ్ కుమార్, అంకాళ్ళ వెంకటేశ్వర్లు, జూపల్లి శేషయ్య, రాజవరపు నరసింహారావు, సూరె వీరయ్య, బూతుకూరి రామిరెడ్డి, షేక్ జానీ ఖాజావలి, పిల్లి సుధీర్ బాబు, నాగూర్ బాబు, తవ్వా హరినాథ్, మామిడి ప్రకాష్, గుర్రం పవన్, బొమ్మిశెట్టి శ్రీనివాస్, గుజ్జర్లపూడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై శిక్షణ



మాట్లాడుతున్న డీఆర్సీ ఏడీఏ ఎం.శివకుమారి

ముప్పాళ్ళ: రైతులు భూసార పరీక్షల ఆధారంగా సాగు చేసే పంటలలో ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తే లాభసాటిగా ఉంటుందని పల్నాడు జిల్లా వనరుల కేంద్రం ఉప వ్యవసాయ సంచాలకులు ఎం.శివకుమారి చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెం రైతు భరోసా కేంద్రంలో నీటి ఎద్దడిలో సాగు చేసుకోవాల్సిన పంటల పరిస్థితిపై రైతులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎం.శివకుమారి మాట్లాడుతూ ప్రతి రైతు సాగు చేసే పొలం మట్టిని పరీక్ష చేయించుకొని, ఫలితాల ఆధారంగా పంటకు అవసరమైన పోషకాలు అందించేలా ఎరువులు వినియోగించుకోవాలని చెప్పారు. అతిగా ఎరువుల వాడకంతో భూసారం దెబ్బతినడంతో పాటు, పంటలకు తెగుళ్ల వ్యాపించే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి పి.ప్రవీణ్ ప్రకృతి ప్రాముఖ్యత ఆవశ్యకతలను వివరించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ, వీఏఏలు శైలజ, సుభాని, రైతులు పాల్గొన్నారు.

వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

బ్రేక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాంబాబు

రాజుపాలెం: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని పిడుగురాళ్ల బ్రేక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాంబాబు తెలిపారు. మండలంలోని గణపవరంలో న్యాయ విజ్ఞాన సదస్సు మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాంబాబు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు ప్రమాదాలపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హెల్మెట్ ధరించక పోవడం వలన యువత ఎక్కువగా రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్నారని తెలిపారు. కారులో ప్రయాణించే వారు సీట్ బెల్టు ధరించక పోవడం చట్టరీత్యా నేరమని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, అలా ఇస్తే వాహన యజమానులకు, తల్లిదండ్రులకు శిక్ష పడే విధంగా చట్టాలున్నాయని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్సు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుండా వాహనాలు నడపరాదు

అమరావతి: హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపరాదని, వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు మోటారు వాహనాల చట్టం గురించి మంగళవారం అమరావతిలో శ్రీ రామకృష్ణ హిందూ హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహిటా ంచారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు ప్రమాదాలపై జాగ్రత్తలు పాటిరచాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో తలకు ఎక్కువగా గాయం కావడం వల్ల చనిపోతున్నారని అందువల్ల తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించకపోవడం చట్టరీత్యా నేరం అన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, అలా ఇస్తే వాహన యజమానులకు, తల్లిదండ్రులకు శిక్షలు పడతాయన్నారు. వాహనదారులు వాహనానికి సంబంధించిన పత్రాలను ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నిర్లక్ష్యం వలన జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో అమరావతి ఎస్సై సీహెచ్ ప్రసాద్ రెడ్డి, పారా లీగల్ వలంటీర్ కోట బాబు రావు, పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

బోర్ల సాయంతో వరి నారుమళ్లు సాగు



నర్సింగపాడు గ్రామం వద్ద బోర్ల కింద సాగుచేస్తున్న వరినారుమళ్లు, జీలుగలు

నకరికల్లు: సాగర్ జలాలు ఈ ఏడాది వస్తాయన్న ఆశలు సన్నగిల్లి పోతుండడంతో ఎన్నెస్పీ కాలువ నీటి ఆధారంగా పంటలు సాగు చేసే అన్నదాతలు అయోమయంలో పడ్డారు. సకాలంలో సరిపడా వర్షాలు రాకుంటే మెట్ట పంటలు సాగుచేయాలా...? అనుకోకుండా సాగర్‌జలాలు వస్తే వేసిన మెట్ట పైర్లు చెడగొట్టి ఖరీఫ్ వరిసాగు చేయాలా...? లేక ఆలస్యంగా సాగునీరు విడుదల చేస్తే ఒక్క పంటగా రబీ వరి సాగు చేయాల్సి వస్తుందా అంటూ ఆలోచనలతో అన్నదాతలు గందరగోళంలో ఉన్నారు. దీంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో సందిగ్ధం నెలకొంది.

వరి నారుమళ్లు సిద్ధం

సాగర్ కెనాల్ ఆధారంగా వరి సాగు చేసే రైతులు ఆలోచనల్లో నిమగ్నం కాగా వ్యవసాయ బావులు, బోరు బావుల ద్వారా నీటి సౌకర్యం ఉన్న రైతులు మాత్రం వరినారు మళ్ల సాగు చేయడంలో దృష్టి సారిస్తున్నారు. ప్రధానంగా మండలంలోని నర్సింగపాడు, త్రిపురాపురం, చల్లగుండ్ల, నకరికల్లు గ్రామాల్లో వరి విత్తనాలు చల్లి నారుమడులు పెంచుతున్నారు.

మూడు వర్గాల ఉపాధికి గండి

బోర్ల సాయంతో కొద్దిపాటి పొలం మాత్రమే సాగయ్యే పరిస్థితి ఉండడంతో వ్యవసాయ పనులు అనుకున్న స్థాయిలో ఉండవని కూలీలు వాపోతున్నారు. సాగర్ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేయని పరిస్థితి ఎదురైతే భూ యజమానులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీల ఉపాధికి గండిపడే అవకాశం కన్పిస్తుంది. అడపాదడపా వర్షాలు కురుస్తున్నా అవి సరిపడా లేవు. ప్రస్తుత పరిస్థితుల్లో వర్షాలు సమృద్ధిగా పడాలని, సాగర్ జలాశయం నుంచి సాగునీటి విడుదల చేయాలని రైతులు, రైతు కూలీలు గంపెడాశలతో ఎదురుచూస్తున్నారు.

కౌలు రైతులకు పంట రుణాలు అందించాలి



రాజుపాలెం: ప్రతి కౌలు రైతుకు పంట సాగుదారు కార్డు జారీ చేసి బ్యాంకుల ద్వారా పంట రుణాలు ఇప్పించాలనే లక్ష్యంతో డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలలో ఆటో ప్రచార కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రచార కార్యక్రమం రాజుపాలెం, రెడ్డిగూడెం, ఆర్ అండ్ ఆర్ సెంటర్, గణపవరం, బలిజేపల్లి, ఉప్పలపాడు, ఇనిమెట్ల గ్రామాలలో నిర్వహించారు. అనంతరం తహసీల్దారు కార్యాయలంలోని సీనియర్ అసిస్టెంట్ కవితకు వినతి పత్రం, కర పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డీబీఆర్‌సీ రీజనల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప మాట్లాడుతూ కౌలు రైతులందరికీ కార్డులు మంజూరు చేసి బ్యాంకుల ద్వారా క్రాఫ్ లోన్‌లు ఇప్పించే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో డీబీఆర్‌సీ మండల కోఆర్డినేటర్ గడిపర్తి కోటిరత్నం, ఏరియా కోఆర్డినేటర్ మేడే వెంకటరమణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

ఎస్టీయూ ఏపీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సుభాని



సత్తెనపల్లి: సీపీఎస్ గెజిట్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని ఎస్టీయూ ఏపీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ఎం సుభాని మంగళవారం డిమాండ్ చేశారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత జీపీఎస్ గెజిట్‌ను ప్రకటించి 2023 అక్టోబర్ నుంచి అమలులోకి వస్తుందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు కూడా సీపీఎస్‌ను ఓపీఎస్‌గా మార్చాలనలి కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించడం జరిగిందన్నారు. కేంద్రంలో మిత్రపక్షంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి లక్షలాది ఉద్యోగ, ఉపాధ్యాయుల కల అయిన ఓపీఎస్ పునరుద్ధరణకు చర్యలు చేపడుతూ డిప్యూటీ డీఈవోలకు, ఎంఈవోలకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఎంఈఓ-2లను రద్దు చేసి ప్రతి మండలానికి ఒక ఎంఈవో చొప్పున అడహక్ పద్ధతిలో ట్రాన్స్‌ఫర్లు చేపట్టాలన్నారు. జీవో 117ను రద్దు చేయడం, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేదపిల్లలకు 'తల్లికి వందనం' వర్తించేటట్లు చర్యలు తీసుకుంటూ విద్యా ప్రమాణాల నాణ్యతను పెంచాల్సిందిగా కోరారు.

ఆర్ఎంపీ శివయ్యకు పోలీసుల వేధింపులు



పోట్లూరి శివయ్య

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం బట్లూరు గ్రామానికి చెందిన తనను సత్తెనపల్లి రూరల్ పోలీసులు వేధింపులకు గురి చేస్తున్నారని ఆర్ఎంపీ వైద్యుడు, వైఎస్సార్‌సీపీ కార్యకర్త పోట్లూరి శివయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం నీ పై కేసు ఉందంటూ తనను సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించారన్నారు. తమ సామాజిక వర్గం వారికి డబ్బులు ఇస్తామని పురికొల్పి తనపై తప్పుడు కేసులు పెట్టి హింసించడానికి ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత నెల 11న తనపై గ్రామంలో టీడీపీకి చెందిన వ్యక్తులు కత్తితో హత్యాయత్నం చేశారని, దీనిపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి వారిని రిమాండ్‌కు పంపారన్నారు. ప్రస్తుతం ఆ కేసు రాజీ కాలేదని, రాజీ నిమిత్తం తనను బెదిరింపులకు గురిచేస్తున్నారని చెప్పారు. పోలీస్ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని తనపై తప్పుడు కేసులు నమోదు కాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు తనకు రక్షణ కల్పించాలని కోరారు.

మహిళలు అప్రమత్తతతో మెలగాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాణిక్యం

అచ్చంపేట: మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, గృహహింస, అక్రమ రవాణా వంటి చర్యల పట్ల మహిళలు అప్రమత్తంగా మెలగాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.మాణిక్యం తెలిపారు. స్థానిక కస్తూరిబా బాలిక పాఠశాల/జూనియర్ కళాశాలలో సంకల్ప మహిళా సాధికారత కార్యక్రమంలో భాగంగా మంగళవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మీ సమీపంలో అపరిచిత వ్యక్తులు సంచరిస్తున్నట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. రుతుక్రమంపై అపోహలు, పాటించవలసిన జాగ్రత్తలు తెలియజేశారు. పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జోత్స్న, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన మహిళా అధికారిపై దుష్ప్రచారం తగదు

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి దాసు



క్రోసూరు: దేవదాయ శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న గిరిజన మహిళా అధికారిపై కొన్ని మీడియా సంస్థలు టార్గెట్ చేయడం నీచమైన చర్య అని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి దాసు అన్నారు. మంగళవారం స్థానిక ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాంతి గిరిజన మహిళ కాబట్టి ఆమెను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తూ కొన్ని మీడియా సంస్థలు ఆమె వివరణ తీసుకోకుండా తప్పుడు వార్తలు ప్రచారం చేయటం నీచమైన చర్య అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపించి తప్పుడు ప్రచారం చేసిన మీడియా సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బంకా శ్రీనివాసరావు, సబ్బసాత్ రవి నాయక్, వట్టిపు మరియదాసు పాల్గొన్నారు.

నేడు మొహర్రం పండగకు సిద్ధం

గ్రామాల్లో పీర్ల చావిడ్ల వద్ద నెలకొన్న సందడి



దొడ్లేరులోని పీర్ల చావిడిలో ఏర్పాటు చేసిన పీర్లు

క్రోసూరు: మొహర్రం పండగ బుధవారం ఘనంగా నిర్వహించుకునేందుకు గ్రామాల్లో పీర్ల చావిడ్లు సిద్ధమయ్యాయి. మత సామరస్యానికి ప్రతీకగా గ్రామాల్లో ప్రజలందరూ నిర్వహించుకునే పండగ మొహర్రం. మహమ్మద్ ప్రవక్త మనవడు ఇమామే హుస్సేన్, అతని కుటుంబీకులు యావత్తు కర్బల మైదానంలో జరిగిన విద్రోహ చర్య కారణంగా అసువులు బాసిన సందర్భంగా వారిని స్మరించుకుంటూ 10 రోజుల పాటు సంతాప దినాలు నిర్వహించుకోవటమే పీర్ల పండగ విశిష్టత. మండలంలోని క్రోసూరు, దొడ్లేరు, హసనాబాద్, గుడిపాడు, నాగవరం తదితర గ్రామాల్లో పీర్ల పండగ వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు.

కుష్టు వ్యాధి నివారణే లక్ష్యం



మాట్లాడుతున్న డాక్టర్ ధర్మసింగ్ శాస్త్రీ



పణిదం పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రదీప్

రేపటి నుంచి ఆగస్ట్ 2 వరకు ఇంటింటి సర్వే



ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఇన్నారావు

సత్తెనపల్లి: కుష్టు వ్యాధి పట్ల అపోహలు దూరం చేయాలని ఏఎంసీ సమీపంలోని అర్బన్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ధర్మసింగ్ శాస్త్రి అన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల ఆధ్వర్యంలో పట్టణంలోని యూపీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18 నుంచి ఆగస్టు 2 వరకు జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే సర్వే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజల్లో కుష్టు వ్యాధి పట్ల అవగాహన కల్పించాలన్నారు. డాక్టర్ ఆసియా, డాక్టర్ భాను ప్రకాష్ మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే సర్వే సక్రమంగా జరగాలన్నారు. లెప్రసీ డీపీఎంవో నాగేశ్వరరావు, సూపర్‌వైజర్ గ్రేస్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫణిదం పీహెచ్‌సీలో...

కుష్టు వ్యాధి నివారణే లక్ష్యంగా పని చేయడం జరుగుతుందని ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వి.ప్రదీప్ అన్నారు. సత్తెనపల్లి మండలం ఫణిదం పీహెచ్‌సీలో కుష్టు వ్యాధి సర్వేలో భాగంగా మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చర్మంపై స్పర్శ లేని మచ్చలు, చెవులు, వీపు, ఎదపై నొప్పిలేని బొడిపెలు, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, కనురెప్పలు మూతపడకపోవడం, ముక్కు దిబ్బడ, ముక్కు నుంచి రక్తం కారడం, చేతుల నుంచి వస్తువులు జారిపోవడం, అంగవైకల్యం రావడం వంటి వాటిని కుష్టు వ్యాధి అనుమానిత లక్షణాలుగా గుర్తించాలన్నారు. ఈ నెల 18 నుంచి జరిగే సర్వే పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఆరోగ్య విస్తరణాధికారి పి.శ్రీనివాసరావు పీహెచ్ఎన్ జీవీసీకే మీనాక్షమ్మ, ఆరోగ్య పర్యవేక్షకులు ఎ.వరలక్ష్మి, డీపీఎంవో నాగేశ్వరరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి కుష్టు వ్యాధి సర్వే

క్రోసూరు: మండలంలో క్రోసూరు, దొడ్లేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని అన్ని సబ్ సెంటర్ల ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు గురువారం నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు కుష్టు వ్యాధి సర్వే కార్యక్రమం ఇంటింటికీ తిరిగి చేపడతారని క్రోసూరు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ఇన్నారావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా క్రోసూరు పరిధిలోని ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుష్టు వ్యాధిని ఎలా గుర్తించాలి, గుర్తించిన వివరాలు ఏ విధంగా ఎంట్రీ చేయాలన్న వివరాలు తెలియజేశారు. కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

కొండముచ్చుకు అంత్యక్రియలు

దాచేపల్లి: మండలంలోని శ్రీనగర్ వాసులు ఓ కొండముచ్చుకు అంత్యక్రియలు చేసి మానవత్వం చాటుకున్నారు. నాలుగు రోజుల క్రితం ఇక్కడి బావి వద్ద ఉన్న చెట్లపై కొండముచ్చు వెళ్తున్న క్రమంలో కరెంట్ తీగెలపై పడి షాక్‌కి గురైంది. దీంతో తీవ్రంగా గాయపడింది. ఆరోగ్యం క్షీణించటంతో మంగళవారం ఉదయం మృతి చెందింది. గ్రామ సర్పంచ్ కూసం నాగిరెడ్డి సూచన మేరకు స్థానికులు ఆటోలో కొండముచ్చు కళేబరాన్ని శ్మశాన వాటిక వద్దకు మేళతాళాలతో తీసుకెళ్లారు. అక్కడే ఖననం చేశారు. అదే సమయంలో మరో కొండముచ్చు వచ్చి ఇదంతా చూస్తూ కనిపించింది.